

వేదికపై మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్ లాడ్, అంత్యోదయ ప్రతిష్ఠాన్ చైర్‌పర్సన్ నీతాలాడ్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాశ్, ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి

ముగిసిన ఆలయాల సదస్సు

- మూడు రోజుల పాటు ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రసంగాలు, చర్చలు
- ఐటీసీఎక్స్-2025 నిర్వహణతో పెరిగిన తిరునగరి ఖ్యాతి

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన అంతర్జాతీయ ఆలయాల సదస్సు బుధవారం అంతే ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా హిందూ మతానికి సంబంధించిన ఆలయాలు, సంస్థల నుంచీ పెద్ద సంఖ్యలో ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. ఐటీసీఎక్స్-2025 నిర్వహణకు వేదికగా నిలవడం ద్వారా తిరుపతి ఖ్యాతి మరింత పెరిగింది. దేశవిదేశాల నుంచీ హిందూ సమాజ ఉన్నత స్థాయి వ్యక్తుల రాక సదస్సు స్థాయిని చాటి చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వారి సందేశాలతో సదస్సు ప్రారంభం కాగా దేశంలోనే పేరుమోసిన వారణాసి, అయోధ్య వంటి ఆలయాల నిర్వాహకులు, పలువురు పీఠాధిపతులు రావడం సదస్సుకు నిండుదనాన్ని సంతరించిపెట్టింది. మరోవైపు ఏపీ, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు, పలువురు మంత్రులు, దేవదాయ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరు కావడంతో రాజకీయ సందడి నెలకొంది. ఆయా రంగాలకు చెందిన నిష్ణాతులైన ప్రముఖుల ప్రసంగాలు ఆహూతులకు విజ్ఞానాన్ని పంచగా.. సదస్సులో సాగిన చర్చలు ఆసక్తి రేపాయి. అలాగే సదస్సు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రధానంగా పలు ఆలయాల చరిత్ర, సమాచారాలతో పాటు ఆలయాల నిర్వహణతో ముడిపడిన టెక్నాలజీని పరిచయం చేశాయి.

ఇనుమడించిన తిరుపతి ఖ్యాతి

గతంలో ఏఐసీసీ ప్లీనరీ, ప్రపంచ తెలుగు మహాసభలు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మహాసభలు వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి సభలు, సమావేశాలకు తిరుపతి వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిస్తున్న తిరుపతిలో ఆధ్యాత్మికంగా ఈ స్థాయి కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు ఇప్పటి దాకా లేవు. తాజాగా ఐటీసీఎక్స్-2025 సదస్సు నిర్వహణతో ఆ లోటు కూడా పూడినట్టయింది. ఏకంగా 17 దేశాలకు చెందిన 1500కు పైగా పేరున్న ఆలయాల నిర్వాహకులు తిరుపతి వేదికగా మూడు రోజుల పాటు సదస్సులో పాల్గొనడం నగర చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనుంది. సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు శ్రీవారి దర్శనం కల్పించాలని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు టీటీడీ అధికారులను ఆదేశించడం తెలిసిందే. తిరుమల శ్రీవారిని దర్శించుకునే అవకాశం ముడిపడి వుండడంతో భవిష్యత్తులో కూడా తిరుపతి వేదికగా ఈ తరహా జాతీయ, అంతర్జాతీయ ఆధ్యాత్మిక సదస్సులు మరిన్ని జరిగేందుకు అవకాశమేర్పడుతోంది.

టీటీడీకి పెరిగిన ప్రాధాన్యం

ఈ సదస్సు ద్వారా ప్రత్యేకించి టీటీడీకి ప్రాధాన్యం మరింత పెరిగింది. సదస్సులో అనేక సందర్భాల్లో టీటీడీ ప్రస్తావనకు రావడం గమనార్హం. ఆలయాల నిర్వహణ, పాలనలో టీటీడీ దేశంలోని ఇతర దేవాలయాలకు నమూనాగా మారి మార్గదర్శనం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇదే అంశం సదస్సులో పదేపదే ప్రస్తావనకు వచ్చింది. తాజాగా వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం త్వరలో దాన్ని టీటీడీలో కూడా అమలు చేస్తామని మంత్రి లోకేశ్ చేసిన ప్రకటనతో మరోసారి టీటీడీ సదస్సులో చర్చనీయాంశమైంది.

సదస్సు తీరుపై అసంతృప్తులూ ఉన్నాయ్

తిరుపతిలో ఎంత గొప్పగా ఐటీసీఎక్స్ సదస్సు నిర్వహించినా స్థానికులతో పాటు సామాన్యులకు ప్రవేశం లేకపోవడం అసంతృప్తిని మిగిల్చింది. సదస్సులో అనేక దేశాలకు చెందిన ఆలయాల నిర్వాహకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, దేశంలోని వివిధ స్థాయిల్లో వున్న వీవీఐపీల రాక కారణంగా భద్రాపరంగా సదస్సు నిర్వహణలో ఆంక్షలు, పరిమితులు ఎక్కువగా కనిపించాయి. కేవలం పాస్ జారీ చేసిన ప్రతినిధులను మాత్రమే పరిమితంగా అనుమతించారు. అందువల్ల సదస్సుకు హాజరు కావాలన్న ఆసక్తి ఎంతోమందికి వున్నా హాజరు కాలేకపోయారు. దానికి తోడు ఈ ప్రాంత ప్రజలకు చిరపరిచితులైన అనేక హిందూ మఠాధిపతులు, పీఠాధిపతులు సదస్సుకు రాకపోవడం కూడా వెలితిగా అనిపించింది. వారిని భాగస్వామ్యం చేసివుంటే బాగుండేదన్న భావన జనంలో కనిపించింది. సదస్సు లక్ష్యం సనాతన ధర్మ వ్యాప్తి, పరిరక్షణ అయినప్పుడు ఇలా పరిమితులతో సదస్సులు నిర్వహిస్తే ఆ లక్ష్యం ఎలా నెరవేరుతుందని, ప్రస్తుత యువతరానికి సదస్సు సందేశం ఎలా చేరుతుందని జనం ప్రశ్నించడం వినిపించింది.

ఇప్పుడు టెన్షన్ లేకుండా చదువుకుంటున్నాం

మంత్రి లోకేశ్ ఎదుట పద్మావతి వర్సిటీ విద్యార్థినుల ఉద్వేగం

ఇంజినీరింగ్ విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వస్తాయో.. రావో అనే ఆందోళనతో గత ప్రభుత్వ హయాంలో చదువుపై దృష్టి పెట్టలేకపోయాం. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిల్లేకుండా రియంబర్స్‌మెంట్ జమ చేస్తున్నారు. అందుకే ఎలాంటి టెన్షన్ లేకుండా ఇప్పుడు మేము చదువుకుంటున్నాం' అన్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎదుట విద్యార్థినులు చెప్పిన మాటలివి. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలోని బీటెక్ ట్రిపుల్‌ఈ మూడో సంవత్సర విద్యార్థినుల తరగతి గదిని మంత్రి లోకేశ్ సందర్శించారు. బోధనా ప్రమాణాలు ఎలా ఉన్నాయని మంత్రి అడగ్గా.. బాగున్నాయంటూ విద్యార్థినులు చెప్పారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ రియంబర్స్‌మెంట్ బకాయిలనూ విడుదల చేస్తామన్నారు. వర్సిటీకి అవసరమైన క్రీడా సామగ్రి సమకూరుస్తామన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీనిపై విద్యార్థినులు ఆనందం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్, విద్యార్థినుల మధ్య సంభాషణ..

మేఘన: ఎన్టీఆర్ హయాంలో పద్మావతి యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. మీరు విద్యాశాఖ మంత్రిగా మా తరగతి గదికి వచ్చి సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉంది.

విజయలక్ష్మి: ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు పొందడానికి మరిన్ని కోర్సులు చేయాల్సి ఉంది. ప్రత్యేకంగా కోర్సులు చేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చవుతోంది. ఆర్థిక స్తోమతలేని నేను ఈ కోర్సులు చేయలేను. అందుకని జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు నిర్వహించాలి. శిక్షణ ఇవ్వాలి.

లోకేశ్: యూనివర్సిటీ విద్యారంగాన్ని మార్పులు తెచ్చి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించేలా చూస్తాం.

మౌనిక: ఉద్యోగాల్లో స్పోర్ట్స్ ప్రియారిటీ ఉంటుంది. చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి.

లోకేశ్: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది.

రాజకుమారి: హాస్టల్లో అందిస్తున్న ఆహారం సరైన నాణ్యత లేదు. ఈ సమస్యను పరిష్కరించండి.

లోకేశ్: రెండు వారాల్లో నాణ్యత పెంపునకు పటిష్ఠ చర్యలు చేపడతాం.

సలీమ్: యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌లో సైకాలజిస్టును నియమించాలి.

లోకేశ్: జీవితంలో ఒడిదుడుకులు అధిగమించాలి. నేను గతంలో మంగళగిరిలో ఓడిపోయాను. తర్వాత జనంతో మమేకమయ్యాను. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ కల్గిన మూడవ అసెంబ్లీగా మంగళగిరి నిలిచింది. దీనిని బట్టి ఎన్ని రకాల అవాంతరాలు వచ్చినా గట్టిగా నిలబడి ఎదుర్కోవాలి. సైకాలజిస్టు నియామకంపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

శిరీష: బీటెక్ పూర్తయ్యేలోపు అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడండి. లైబ్రరీలో మరిన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

లోకేశ్: ప్లేస్‌మెంట్స్ ఎలాంటి డోకా లేదు. కొత్త పరిశ్రమలు రావడంతో ఉపాధికి ఎలాంటి సమస్య ఉండదు.

కాలేజీ, హాస్టల్ సమస్యలు తీర్చాలన్న కొందరు విద్యార్థినుల మాటకు.. తగు పరిష్కారాన్ని వీలైనంత త్వరగా చూపుతామని లోకేశ్ హామీ ఇచ్చారు.

- బీటెక్ ఈఈఈ మూడో సంవత్సరం తరగతి గది వద్దకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్.. క్లాస్‌లోని అధ్యాపకురాలి అనుమతి తీసుకొని లోపలకు వెళ్లారు. తనతోపాటు వీసీ, రిజిస్ట్రార్, కలెక్టర్, మీడియా ఉంటే విద్యార్థినులు తమ సమస్యలను ధైర్యంగా చెప్పుకోలేరని భావించి.. అందరినీ బయటకు పంపేశారు.
- ఇంజినీరింగ్ కాలేజీ నుంచీ వెనుదిరిగే క్రమంలో వివిధ సమస్యలపై కొందరు బయటివారూ వినతిపత్రాలతో అక్కడికి వచ్చారు. ఇది యూనిర్సిటీ. ఈ అంశాలకు సంబంధించిన వినతిపత్రాలే ఇవ్వాలన్నారు.
- ఓ విద్యార్థిని కోరిక మేరకు ఆమె తండ్రితో వీడియో కాల్‌లో మంత్రి లోకేశ్ మాట్లాడారు. మీ బిడ్డను బాగా చదివించాలనీ, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.



విద్యార్థినులతో లోకేశ్ సెల్ఫీ

రూ.5 లక్షలతో డ్రోన్ తయారు చేస్తున్నాం

పద్మావతి వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ (టీబీఐ), ఐటీ, లైఫ్ సైన్సెస్ ల్యాబ్‌లను మంత్రి లోకేశ్ పరిశీలించారు. 2.5 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే డ్రోన్‌ను తాము కేవలం రూ.5 లక్షలతో తాము తయారు చేస్తున్నట్టు అక్కడి నిపుణుల తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు గతంలో చేపట్టిన జ్ఞానభేరి కార్యక్రమం సందర్భంగా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. రూ.40 లక్షల దాకా స్టార్టప్‌లకు ఆర్థిక సాయం కూడా చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 26 మందికి ఇచ్చామనీ, త్వరలో మరో 14 మందికి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇన్నోవేషన్స్, స్టార్టప్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో పని చేస్తున్నట్టు మంత్రికి వివరించారు. సోలార్ ఫోన్, ఛార్జర్, వాటర్ బాటిల్స్ వ్యర్థాలతో బ్యాగుల తయారీ, అరటి పండు తొక్కతో శాలువా, హెర్బల్ శానిటరీ న్యాప్‌కిన్స్ వంటి ఆవిష్కరణలను మంత్రి పరిశీలించారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం



శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో రూ.7.5 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన అధునాతన ఇండోర్ స్టేడియంను బుధవారం మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ఏరోబిక్స్, తైక్వాండో, యోగా, ధ్యాన కేంద్రాలను, సబ్ స్టేషన్-3 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి కాసేపు షటిల్ ఆడారు. యూనివర్సిటీలోని క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని కోరారు. ఇటువంటి అధునాతన ఇండోర్ స్టేడియం నిర్మించడం వల్ల క్రీడాకారులకు మంచి ప్రయోజనం కలుగుతుందని క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రీడా సదుపాయాలను విద్యార్థినులు వినియోగించుకోవాలని వీసీ ఉమ, శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న లోకేశ్, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వీసీ ఉమ, శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు



ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఎండీ గిరీషా, కలెక్టర్ వెంకటేశ్వర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, బల్లి కళ్యాణ చక్రవర్తి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, తిరుపతి కమిషనరు మౌర్య, పద్మావతి వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ శారా సరోజిని, పీఆర్వో శ్రీరజని, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం



తిరుపతి రూరల్ తుమ్మలగుంట సమీపంలో బుధవారం అర్ధరాత్రి టిప్పర్ ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ రామానుజపల్లి చెక్ పోస్టు దాటాక జాతీయ రహదారిపై స్కూటీలో ఓ బాలిక, కడప జిల్లా బురిడపల్లికి చెందిన సాహిర్‌బాషా ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. అదే సమయంలో ఆర్‌సీ పురం జంక్షన్ నుంచి ఉప్పరపల్లి వైపు రాంగ్ రూట్‌లో వస్తున్న టిప్పర్ వీరిని ఢీ కొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చనిపోయిన బాలిక వివరాలు తెలియాల్సి వుందని సీఐ చెప్పారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

పేదలను దోచి కార్పొరేట్లకు మేలు చేస్తున్నారు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- కేంద్ర బడ్జెట్‌పై నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పేదలను దోచి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని, దానికి నిదర్శనమే ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హరికృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకపోగా బడ్జెట్‌లో పేదల నుంచి ముక్కుపిండి వసూలు చేసి, బడా కార్పొరేటర్లకు దోచిపెడుతోందన్నారు. ఈ విషయంలో నిలదీయాల్సిన టీడీపీ, వైసీపీ నోరెత్తకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉపాధి నిధుల్లో కోత పెట్టారని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకుండా ప్రధాని విదేశాల చుట్టూ తిరుగుతుండడం సిగ్గుచేటన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, కె.రాధాకృష్ణ, ఎస్.జయచంద్ర, పి.సాయిలక్ష్మి, టి.సుబ్రమణ్యం, సి.పెంచలయ్య, పి.వెంకటరత్నం, టి.లోకేష్‌రెడ్డి, వేణు, శివ, అరుణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

- రూ.271 కోట్లతో అంచనాలు సిద్ధం -

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.272కోట్లతో బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. గురువారం జరగనున్న కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో కౌన్సిల్ చర్చించనుంది. రెవెన్యూ ఆదాయం రూ.170 కోట్లు, ఖర్చు రూ.116కోట్లు, మూలధన రాబడి రూ.92కోట్లు, ఖర్చు రూ.130 కోట్లకు అంచనా వేశారు. అదేవిధంగా 2024-25 బడ్జెట్ అంచనాలను మేయర్ సవరించారు. బడ్జెట్ సమావేశం అనంతరం జరిగే కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో 41 అంశాలు అజెండాలో చేర్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లింపు, తాగునీటి సమస్య పరిష్కారం, వైర్‌లెస్ సెట్ల కొనుగోలు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, చెత్త సేకరణ, వాహనాల మరమ్మతులకు ఆమోదించనున్నారు. అదేవిధంగా పలు అంశాలను టేబుల్ అజెండాలో చర్చించనున్నట్లు తెలిసింది.

రెండు ట్యాక్సీలపై ఆంక్షల విధింపు

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించిన రెండు ట్యాక్సీలకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకురు. తిరుమలలో బుధవారం సాయంత్రం జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది ఆకస్మిక వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో పర్మిట్ లేని ఓ టవేరాను, ఇన్సూరెన్స్ లేని మరో సుమోను సీజ్ చేశారు. ఎంవీఐ రూ.15 వేల జరిమానా విధించారు. ఈ వాహనాలపై వారంరోజుల పాటు తిరుమలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు ఉన్న వారే ట్యాక్సీలను నడపాలని ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్లను ఆదేశించారు.

పద్మావతి వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ వెన్నం ఉమ బుధవారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. తనను వీసీగా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారంతో యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. రిజిస్ట్రార్ రజని, పలువురు అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

కొన్ని భజన సంఘాలైపోయాయి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ

తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘమే అని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చెప్పుకొచ్చారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు తనపై క్రిమినల్ కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఐపీఎస్ అధికారి అంజనేయులు తనకు వీడియో కాల్ చేసి ప్రభుత్వంలోని పెద్దల పేర్లు చెప్పి ఉద్యమాన్ని ఆపాలని, ఎస్‌ఆర్‌కే అనే వ్యక్తి వద్ద లొంగిపోవాలని చెప్పారన్నారు. అయితే ఓ అధికారిగా ఉండి ఇలా మాట్లాడడం తగదని అంజనేయులుతో తాను చెప్పానన్నారు.ఉద్యోగులంతా సమస్యల పరిష్కారం కోసం పోరాడి అప్పట్లో క్షతగాత్రులయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని సంఘాలు ప్రభుత్వానికి అనుకూలంగా భజన చేస్తున్నాయి తప్ప ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు జీపీఎఫ్ మొత్తం రూ.25కోట్లను గత ప్రభుత్వం స్వాహా చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం దానిని ఎలా చెల్లిస్తుందో చెప్పాలన్నారు. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు సత్వరమే పీఆర్‌సీ ఇవ్వాలన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

భాకరాపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని మాట్లాడుతూ పిల్లలు చదవడం, రాయడం నేర్చుకునేలా బోధించాలన్నారు. పాఠశాలకు వెళ్లేటప్పటికి మానసిక పరిణతి సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. ఎంఈవో-2, హెచ్‌ఎం మృదులాదేవి, పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు నైపుణ్యత దోహదం


డీజిల్ ఇంజన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కో-ఆర్డినేటర్

భాకరాపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పనకు వృత్తి విద్యా కోర్సులు తోడ్పడతాయని చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మృదులాదేవి అన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో క్షేత్ర స్థాయి అవగాహనకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు విద్యార్థులకు తీసుకెళ్లారు. వారికి వివిధ ట్రేడుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఏదో రంగాన్ని ఎంచుకుని నైపుణ్యాన్ని సాధించేలా కృషి చేయాలన్నారు. నైపుణ్యాసాధన ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతుందన్నారు. కో-ఆర్డినేటర్స్ నాగరాజా, మల్లిఖార్జున రావు, రమేశ్, దుర్గారావు, సైన్స్ ఉపాధ్యాయులు గురప్ప పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడు బహిరంగ క్షమాపణ చెప్పాలి

● బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద ఉద్యోగిని దుర్భాషలాడిన బోర్డు సభ్యుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని తిరుపతి బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బోర్డు సభ్యుని తీరు బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. బోర్డు సభ్యులు దైవాంశ సంభూతులు కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. టీటీడీ ఉద్యోగులను, స్థానికుల సహనాన్ని చేతకానితనంగా చూడవద్దన్నారు. వారు విచక్షణ కోల్పోతే గమ్యస్థానాలకు కూడా చేరుకోలేరన్నారు. దర్పం ప్రదర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనల వల్ల టీటీడీ పవిత్రతకు భంగం వాటిల్లడంతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠ మసకబారుతుందన్నారు. టీటీడీ బోర్డు ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో స్పందించి ఆ బోర్డు సభ్యుని నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు చేయాలి

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఉద్యోగిని దూషించిన టీటీడీ బోర్డు సభ్యుడు ఎస్ నరేష్‌ను బోర్డు నుంచి వెంటనే తొలగించడంతో పాటు కేసు నమోదు చేయాలని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంబీయూలో ఏఐ డేటా సైన్స్‌పై అవగాహన



చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్‌పై సదస్సు నిర్వహించారు. మూడు రోజుల పాటు డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(న్యూఢిల్లీ) ఆర్థిక సహకారంతో సదస్సు జరిగింది. శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రకుమార్ రావు ఆధ్వర్యంలో కంప్యూటర్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులను విద్యార్థులకు వివరించారు. కంప్యూటర్ రంగంపై ఆసక్తి, అవగాహన కల్పించారురు. కార్యక్రమంలో ఎంబీయూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రుయాలో అనధికార దుకాణం మూత

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రుయాలో అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని రుయా అధికారులు బుధవారం సీజ్ చేశారు. రుయాలో టెండర్ల ప్రకారం పది దుకాణాలను అధికారులు ఇటీవల వ్యాపారులకు కేటాయించారు. అయితే ఓ వైసీపీ నేత దక్కించుకున్న దుకాణం ముందు ఉన్న ఖాళీ స్థలంలో అనధికారికంగా టెంకాయలు, ఫ్రూట్ జ్యూస్ దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం రుయాలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు ఆ దుకాణాన్ని పరిశీలించి, మూత వేయాలని సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఏఆర్ఎంవో హరికృష్ణలకు ఆదేశించారు. వెంటనే వారు ఆ దుకాణాన్ని సీజ్ చేశారు.

పరాశరేశ్వరుడి సేవలో మంత్రి సుభాష్



తిరుచానూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యోగిమల్లవరంలో కొలువైన కామాక్షాంబ పరాశరేశ్వరస్వామివారిని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సభాష్ బుధవారం దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ వద్ద అర్చకులు మంత్రికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఆయన మొక్కులు చెల్లించుకున్నారు.

కేంద్రమంత్రి పెమ్మసానిని కలిసిన తెలుగు యువత నేతలు



తిరుచానూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు బుధవారం వచ్చిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను తెలుగు యువత రాష్ట్ర నేత పెమ్మసాని సుమన్‌నాయుడు, జయచంద్రరాజు తదితరులు కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

విద్యార్థికి ప్రశంసలు



తిరుచానూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఆర్ఐ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి కరణ్‌సాయిరెడ్డి కరాటేలో విశేష ప్రతిభ కనబరిచాడు. నోబుల్‌బుక్ వరల్డ్‌రికార్డు సంస్థ నుంచి ప్రశంసలు పొందాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల కరస్పాండెంట్ తేజస్వినిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు హేమకుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధునిక సాంకేతకతతో పరిశోధిస్తే ఉత్తమ ఆవిష్కరణలు


సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

రామచంద్రాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అలవరచుకోవాలని బెంగళూరుకు చెందిన ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి సలావుద్దీన్ అన్నారు. బుధవారం వెంకట్రామపురంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులు కష్టపడి చదివి ఆధునిక సాంకేతికతతో కూడిన పరిశోధనలు చేస్తే మంచి ఔషధాలు ఆవిష్కరించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై రాజీలేని పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం వైసీపీ నగర నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత వైసీపీదేనన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీషా, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి ప్రసంగించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. నగరాధ్యక్షుడిగా మల్లం చంద్రారెడ్డి నియమితులయ్యారు.

తిరుమలలో తప్పిపోయిన ఏలూరు వాసి


శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ భక్తుడు కనిపించకుండా పోయాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ఏలూరు జిల్లాలోని పూనంగి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు(60) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15వ తేదీన తిరుమలకు వచ్చాడు. ఉదయం 7.30 గంటలకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోకి ప్రవేశించాడు. ఆతర్వాత కనిపించలేదు. కుటుంబసభ్యులు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు ఆచూకీ తెలిసినవారు 0877 2289027, 94407 96769 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

సమష్టిగా నగరాభివృద్ధి చేసుకోండి: లోకేష్


కార్పొరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్పొరేటర్లు సమష్టిగా నగరాభివృద్ధి చేసుకోవాలని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం కోసం పనిచేసిన కార్పొరేటర్లు లోకేశ్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. వైసీపీ హయాంలో కార్పొరేటర్లకే కాకుండా మేయర్‌కు కూడా కనీస గౌరవ మర్యాదలు ఇవ్వలేదని తెలిసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీలోని మేయరైనా కార్పొరేటర్లకు తగిన గౌరవం కల్పిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నగరాభివృద్ధికి ఎలాంటి హామీలు ఇచ్చారో, అవన్నీ చేసుకోవచ్చని చెప్పారు. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణలతో పాటు కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర, కుడితి సుబ్రమణ్యం, సీకే రేవతి, కల్పన, నారాయణ తదితరులు ఉన్నారు.

17వ రోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 17వ రోజుకు చేరింది. కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు హైక్ స్టైఫండ్ అనే ఆంగ్ల అక్షరాలు, 17వ సంఖ్యలో కూర్చుని నిరసన తెలిపారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, సీవోఈ ప్రొఫెసర్ డాక్టర్ చంగల్వరాయులు, డెయిరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు వారితో మాట్లాడుతూ సమ్మెను విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. స్పష్టమైన హామీ లేకుండా సమ్మెను విరమించబోమని వారు స్పష్టం చేశారు. కాగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను విద్యార్థులు కలసి సమస్యను విన్నవించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


సీతమ్మరోడ్‌లో శివాజీ జయంతి కార్యక్రమంలో భజరంగ్‌దళ్ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ 395వ జయంతి కార్యక్రమాలు బుధవారం నగరంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పంగలూరు సీతమ్మ రోడ్‌లో శివాజీ కటౌట్ ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రముఖ న్యాయవాది భవానీ శంకర్, విశ్వహిందూ పరిషత్ నాయకులు కిరీటి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌బాబు, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌పల్లి కూడలిలో: బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కుమారుడు పృథ్వీరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లి కూడలిలో శివాజీ జయంతి నిర్వహించారు. దేశంకోసం ఆయన చేసిన త్యాగాలను, పోరాటాలను గుర్తు చేసుకున్నారు.

శ్రీకృష్ణదేవరాయ కూడలిలో: శ్రీకృష్ణదేవరాయ కూడలిలో బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యయాదవ్, ప్రభాకర్ నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, విజయభాస్కర్, గురుప్రసాద్ పాల్గొన్నారు.


టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేశ్‌కు నమస్కరిస్తున్న తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ


టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో జరిగిన యూనిట్, వార్డు, బూత్ ఇన్‌చార్జుల సమావేశంలో మంత్రి లోకేశ్

మహిళలతో ముఖాముఖి

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కొన్ని సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ


సతీమణి ఉషాకు నగదు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. తిరుపతి రూరల్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు టి.అనిల్ వైద్య ఖర్చుల నిమిత్తం ఎస్పీ బుధవారం రూ.75 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు అనిల్ సతీమణి ఉషాకు చెక్కు అందజేశారు. అలాగే రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన టి.మల్లికార్జున కుటుంబానికి ఐఆర్ నిధుల కింద అతని భార్య సరస్వతికి రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సురేష్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి లోకేశ్ సత్కారం



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సత్కరించారు. అంతర్జాతీయ ఆలయాల సదస్సు - ప్రదర్శన ముగింపు సమావేశానికి వచ్చిన లోకేశ్ పలువురిని సత్కరించారు. సదస్సు నిర్వహణకు సహకరించిన భానుప్రకాష్‌రెడ్డిని సన్మానించారు. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి, మహారాష్ట్ర ఛీప్‌విప్, ఎమ్మెల్సీ, ఆలయాల సదస్సు ఛైర్మన్ ప్రసాద్ లాడ్ భానుప్రకాష్‌రెడ్డిని సత్కరించారు.

పేదల ఇళ్ల నిర్మాణ మొత్తాన్ని పెంచాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


హౌసింగ్ కాలనీని సందర్శించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లిలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఇళ్లను తమ పార్టీ జిల్లా నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టణ ప్రాంత నిరుపేదల ఇంటికి సెంటు స్థలం ఇచ్చిందన్నారు. అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్ల భూమి మంజూరు చేస్తామని, ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు రుణం మంజూరు చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిర్మాణ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. తిరుపతిలోని నిర్మించిన 26 వేల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కొరవడిందన్నారు. మంత్రి పార్థసారథికి ఈ విషయం తెలియజేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళిలు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, సీహెచ్ ప్రభాకర్, నగర కార్యదర్శి విశ్వనాథ్, బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్‌డి రవి, రామకృష్ణ, కెవై రాజా, ఎస్ శివ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే చర్యలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో రోగులకు పెట్టే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ నిర్వాహకులను హెచ్చరించారు. రుయాస్పత్రిలో రోగులకు పెట్టే భోజనాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. నీళ్లతో కూడిన పప్పు, కూరగాయలు లేకుండా ఉన్న సాంబారును గుర్తించి, సిబ్బందిపై మండిపడ్డారు. 'ఇలాంటి భోజనాలు మీరు తింటారా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేకపోయినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ లోడ్ పర్యవేక్షణ సెల్ జీఎంగా చక్రపాణి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోడ్ పర్యవేక్షణ సెల్ జనరల్ మేనేజరుగా జి.చక్రపాణి బుధవారం సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. సదరన్ డిస్కంలో ఇటీవల ఐదుగురు ఈఈలకు పదోన్నతులు కల్పించారు. పదోన్నతులు పొందిన వారు బుధవారం వారి వారి స్థానాల్లో బాధ్యతలు తీసుకున్నారు. ఎల్ఎంసీ జీఎంగా జి.చక్రపాణి, ఆపరేషన్-మెయింటెనెన్స్ కమర్షియల్ విభాగం జీఎంగా నీలం నరేంద్రనాథ్, పే అండ్ ఎంఎం విభాగం జీఎంగా ఎస్.రమేష్, ఉద్యోగుల శిక్షణ విభాగం జీఎంగా బి.మురళీధర్‌బాబు బాధ్యతలు తీసుకున్నారు. వారికి సీజీఎం పి.అయూబ్‌ఖాన్, జీఎం ఎం.కృష్ణారెడ్డి, ఓఎస్‌డీ మునిశంకరయ్య, ఈఈలు పి.రవికుమార్, సుబ్బారావు, నంజుండేశ్వర్, అకౌంట్స్ అధికారి రామ్మోహన్‌రావు, డీఈఈ మునిప్రసాద్ పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు

కార్మిక శాఖ మంత్రి సుభాష్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రుల్లో కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి వైద్య సేవల గురించి రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో రోజుకు 150 మంది రోగులు ఓపీకి వచ్చేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 350కి పెరిగిందని అన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ శ్యాంబాబు అక్కడి పరిస్థితిని మంత్రికి వివరించారు. సీఎస్ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

స్విమ్స్, ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి ఒప్పందం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రోగులకు, వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్విమ్స్, ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి మధ్య ఒప్పందం(ఎంవోయూ) కుదిరినట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం తెలిపారు. ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో అవసరమైన వారికి స్విమ్స్‌లో అత్యవసర వైద్యం, లేబొరేటరీ పరీక్షలు, అలాగే ఎంబీబీఎస్, ఎంఎస్ ఆప్తమాలజీ విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో పొందుటకు గాను పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల వరకు ఈ ఒప్పందం ఉంటుందని వెల్లడించారు.

నేడు డిప్యూటీ మేయర్
ప్రమాణ స్వీకారం

సెనేట్ హాలులో బాధ్యతలు స్వీకరించనున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించిన 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎస్వీయూ సెనేట్ హాలులో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి నగరం పసుపుమయంగా మారింది. పార్టీ శ్రేణులు పెద్దయెత్తున శుభాకాంక్షల ఫెక్సీలతో నింపేశాయి. కూటమి నాయకులతో కలసి మునికృష్ణ గురువారం ఉదయం 10 గంటలకు టౌన్‌క్లబ్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించనున్నారు. అక్కడి నుంచి జ్యోతిరావ్ పూలే విగ్రహం, ఎస్వీయూ ప్రధాన గేటు ఎదురుగా గల అంబేద్కర్ విగ్రహానికి టీఎన్ఎస్ఎఫ్ నేతలతో కలసి నివాళులర్పించనున్నారు. అక్కడి నుంచి సైకిల్‌పై ఎస్వీయూ సెనేట్ హాలుకు చేరుకుంటారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ల సమక్షంలో కమిషనర్ మౌర్య ఇతర అధికారులు ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.



● అవమానించిన చోటే అందలం

వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ. అధికార బలంతో 48 డివిజన్లను దౌర్జన్యంగా తన ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకున్న వైసీపీకి ఆర్సీ మునికృష్ణ ఒకే ఒక్కడుగా ఎదురునిలిచి టీడీపీ జెండా ఎగురవేశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు దాడికి దిగేటంత పనికి ఒడిగట్టినా, అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఏక్ నిరంజన్ అంటూ హేళన చేసినా టీడీపీ తరఫున తన గళాన్ని వినిపిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీ ఏర్పడ్డ డిప్యూటీ మేయర్ ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా విజయదుందుబి మోగించారు. తనపై నమ్మకంతో పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని, నగరాభివృద్ధితో పాటు అందరినీ కలుపుకుంటానని మునికృష్ణ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. పార్టీ బలోపేతానికి కూడా తనవంతు కృషి చేస్తానన్నారు.

లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలి

● బ్యాంకర్లకు జేసీ శుభం బన్సల్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యం మేరకు రుణాలను మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్స్‌తో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం ఫర్ పథకం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వందశాతం అందేలా చూడాలన్నారు. విద్యా రుణాలు సకాలంలో మంజూరు చేసి, పురోగతి సాధించాలని సూచించారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాల్లో అర్హుల పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రతి రుణానికి సంబంధించి ఇన్సూరెన్స్ కవర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్డీవో పూర్ణిమ, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ రాంప్రసాద్, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి, నాబార్డు డీడీఎం సునీల్, డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం

నేటి నుంచి ముక్కోటిలో శివరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినదీ తీరాన వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 28 వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి ఈమేరకు తెలిపారు. గురువారం ఉదయం వినాయకస్వామి పూజ, సాయంత్రం అంకుర్పారణ, రాత్రి7 గంటలకు మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం కలశస్థాపన, గణపతి హోమం, గోపూజ, పూర్ణాహుతి ఉంటుందన్నారు. మయూర వాహనంపై సుబ్రమణ్యంస్వామి, రాత్రి సింహ వాహనంపై ఆనందవల్లీ దేవిలను ఊరేగిస్తారు. శనివారం శేషవాహనంపై, రాత్రి భూతవాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తారని వివరించారు

'టీటీడీ సభ్యుడు నరేష్‌ను తొలగించండి'

తిరుపతి(ఆటోనగర్/ ఎంఆర్ పల్లె), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఉద్యోగి బాలాజీని దుర్భాషలాడిన పాలకమండలి సభ్యుడు నరేష్‌ను పదవి నుంచి తొలగించి, కేసు నమోదు చేయాలని వామపక్ష నేతలు పి.మురళి, ఆర్.హరికృష్ణ, వి.నాగరాజు, కందారపు మురళి వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. దీనిపై టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి టీటీడీ ఉద్యోగిని అసభ్యంగా దూషించిన నరేష్ బోర్డు సభ్యత్వ పదవికి రాజీనామా చేయాలన్నారు.

ఆర్టీసీ బస్సు సీట్స్ ఫ్యాబ్రిక్ కెమికల్ వాష్ డెమో

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీలో డీపీటీవో నరసింహులు ఆధ్వర్యంలో బుధవారం సీట్స్ ఫ్యాబ్రిక్ కెమికల్ వాష్ యంత్రం పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అల్ట్రా డీలెక్స్, సూపర్‌లగ్జరీ బస్సుల్లోని సీట్స్‌లో పేరుకుపోయిన దుమ్ము, నల్లులను అడ్వాన్సు కెమికల్స్ ద్వారా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రెండు కంపెనీలను ఎంపిక చేశారు. ఒక కంపెనీ ప్రస్తుతం డెమో ఇచ్చింది. మరో కంపెనీ త్వరలోనే ఇవ్వనుంది. మెరుగైన పనితీరు ఇచ్చే కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వనున్నారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు హేమాద్రియాదవ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. బుధవారం తిరుపతికి వచ్చిన లోకేశ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. హేమాద్రి మాట్లాడుతూ తిరుపతిలో యూనివర్శిటీలు ఉన్నా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవని చెప్పారు. కళాశాలలు ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళల విద్యా సాధికారతే లక్ష్యం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా విద్యా సాధికారతే లక్ష్యంగా భేటీ బచావో, భేటీ పడావో పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారిణి వసంత బాయి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఈ పథకంపై సమావేశం నిర్వహించారు. ఉన్నతాశయంతో ప్రధాని మోదీ పదేళ్ల క్రితం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారని గుర్తు చేశారు. ఆడపిల్లల మనుగడ, రక్షణ, విద్యను ప్రోత్సహించడమే దీని లక్ష్యమని, బాల్య వివాహాలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో శ్రీనివాసులురెడ్డి, సీఐ తమీమ్ అహ్మద్, డీఎల్‌డీవో నారాయణ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య



మృతి చెందిన అనర్జిత్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తిరుపతి రూరల్ మండలం వెంకటపతినగర్‌లో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పిన మేరకు.. ఉత్తరప్రదేశ్ మహారాజ్ గంజ్ జిల్లా, భరత్‌గడ గ్రామానికి చెందిన అనర్జిత్ ఉపాధి కోసం కొన్నేళ్ల క్రితం తిరుపతికి వచ్చాడు. రూరల్‌లోని వెంకటపతినగర్‌లో ఇల్లు తీసుకుని ఉంటున్నాడు. ఆయనకు పెళ్లయి భార్య, కుమారుడు ఉత్తరప్రదేశ్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో సొంతూరు పక్కన గ్రామానికి చెందిన సోనాలిని వివాహం చేసుకుని, ఆమెను ఇక్కడికి తీసుకొచ్చాడు. ఆమెకు రెండు నెలల కుమారుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న మొదటి భార్య సలహంతదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాళ్లు రాజీచేసి పంపారు. భార్యల మధ్య గొడవలు ఎక్కువ కావడంతో వాటిని తీర్చలేక మద్యానికి అలవాటుపడ్డాడు. పనికి వెళ్లడం మానేశాడు. కుటుంబ, ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు రాహ్మిట్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

మతి స్థిమితం లేని వ్యక్తిపై దాడి

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడిచేసి గాయపరచిన ఘటన తిరుపతి క్రైం స్టేషన్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. క్రైం స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో మతి స్థిమితం లేని వ్యక్తి సంచరిస్తున్నాడు. ఆ దారిలో వెళ్లే బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు కొందరు అతన్ని చితకబాదారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని వెస్ట్ పోలీసులు చెప్పారు.

డీసీసీబీ సీఈవో రాజీనామా

చిత్తూరు కలెక్టరేట్ ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరుజిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో మనోహరగౌడ్ బుధవారం సాయంత్రం తనపదవికి రాజీనామా చేశారు. బ్యాంకు స్పెషల్ ఆఫీసర్ అయిన జేసీ విద్యాధరికి రాజీనామాపత్రాన్నిఅందజేశారు.కొత్త సీఈవో నియామకం జరిగేంతవరకు కొనసాగాలని మనోహర్‌కు జేసీ సూచించారు.డీసీసీబీలో జీఎంగా వున్న మనోహర్ 2019 డిసెంబరు 30నుంచి మూడు సంవత్సరాల పాటు సీఈవోగా కొనసాగారు.రెండో విడతలో 2022 డిసెంబరు 30 నుంచి సీఈవోగా కొనసాగుతున్నారు.ఇక ఆయన డీసీసీబీ ప్రధానకార్యాలయంలో జీఎంగా విధులునిర్వర్తిస్తారు.









భక్తులకు భరోసా టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్

● మంత్రి వాసంశెట్టి సుభాష్

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయాన్ని సందర్శించే భక్తుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి టీటీడీ ఫీడ్‌బ్యాక్ బుక్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం స్వామిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇది భక్తులకు భరోసా ఇస్తుందన్నారు. 99.6 శాతం పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా శ్రీవారి ప్రసాదాల నాణ్యత పెంపు, పరిశుభ్రత చాలా పకడ్బందీగా జరుగుతోందన్నారు. కాగా శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్ మహాద్వారం గేటు నుంచి కాకుండా బయోమెట్రిక్ నుంచే వెలుపలకు రావడం విశేషం.

→ బయోమెట్రిక్ నుంచి ఆలయం వెలుపలకు వస్తున్న మంత్రి సుభాష్




సురుటుపల్లిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

నాగలాపురం, ఫిబ్రవరి 19, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాగలాపురం మండలం సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ధ్వజస్తంభం వద్ద పంచ మూర్తుల ఉత్సవర్లకు అభిషేకాది కార్యక్రమాలను చేపట్టారు. యాగశాల మండపంలో వృషభయాగం నిర్వహించారు. పూర్ణాహుతి జరిపి నందీశ్వరుడి చిత్రంతో ఏర్పాటు చేసిన ధ్వజపటానికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేశారు. తద్వారా శివరాత్రి ఉత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు.

— ధ్వజ పటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు —

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,427

తలనీలాలు సమర్పించినవారు: 21,066

భక్తుల కొంగు బంగారం



శ్రీకాళహస్తిలోనే కాదు భట్లకనువూరులోనూ కాళహస్తీశ్వరుడు కొలువుదీరి నిత్య పూజలందుకుంటున్నాడు. ఆధ్యాత్మిక వెలుగులు పంచుతున్నాడు. 1246లో ఈ దేవాలయాన్ని చోళుల చివరి రాజైన రాజేంద్ర చోళ-3 హయాంలో అరవభూమి రెడ్ల వంశస్తులు నిర్మించారని చెబుతారు. అప్పట్లోనే ఆలయ నిర్వహణకు లోటుపాట్లు రాకుండా 80 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. - ఓజిలి,ఆంధ్రజ్యోతి

శివరాత్రి వేడుకలకు సిద్ధం : ప్రస్తుతం జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తే ఆలయంలో నిత్యారాధనలు,జరుగుతున్నాయి. ఇటీవల త్రైమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఏటా కోనేరులో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 26న శివరాత్రి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, దేవదాయ అధికారులు, గున్నంరెడ్డి కుటుంబీకులు సంయుక్తంగా కృషి చేస్తున్నారు.

●భట్లకనువూరులో కాళహస్తీశ్వరాలయం



జ్ఞానప్రసూనాంభ సమేత కాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానం

నాలుగేళ్లుగా పూర్వ వైభవం : నాలుగు దశాబ్దాల క్రితం వరకు దేవాలయ నిర్వహణ సజావుగానే కొసాగింది. తర్వాత గ్రామంలో వివిధ పరిణామాల నేపథ్యంలో దేవాలయాన్ని పట్టించుకోలేదు. ధూప,దీప, నైవేద్యం పెట్టేవారే కరువయ్యారు. ఆరాధనలు అటకెక్కాయి. జీర్ణాలయంగా మారిపోయింది. ప్రహరీ గోడలు పడిపోయాయి. ధ్వజస్తంభం విరిగిపోయింది. ఈక్రమంలో నాలుగేళ్ల క్రితం గ్రామస్తులందరూ. ఆలయ నిర్వహణపై దృష్టి పెట్టారు. గ్రామానికి చెందిన గున్నంరెడ్డి కుటుంబీకులతోపాటు మరికొందరు దాతలు ముందుకు వచ్చారు. మాన్యం భూములకు క్రమం తప్పకుండా వేలం నిర్వహించారు. ఏటా రూ.5 లక్షల రాబడికి ఆలయం చేరుకుంది. దాతల సహాయం రూ.1.30 కోట్లతో కాళహస్తీశ్వరాలయానికి పూర్వ వైభవాన్ని తెచ్చారు. ఆలయంలో ప్రాంగణంలో చిన్న దేవాలయాలను సైతం నిర్మించారు. దీంతో దేవదాయ శాఖ సీ కేటగిరీల ఆలయంగా తన పరిధిలోకి తీసుకుంది.

25 రోజుల్లో..

● 148 కిలోల గంజాయి స్వాధీనం
● 225 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్
● బహిరంగంగా మద్యంతాగే వారిపై 2378 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాదారులు.. ఆకతాయిలు, రౌడీషీటర్లు.. ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగేవారిపై పోలీసులు నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు వారిపై చర్యలు తీసుకుంటూ, కేసులు పెడుతున్నారు. ఇలా గత 25 రోజుల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి 148 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 225 మంది రౌడీషీటర్లను ఆయా పోలీసు స్టేషనకుఉ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఇక తిరుపతిలో పాటు చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, పాకాల.. ఇలా పలుచోట్ల శివార్లలో బహిరంగంగా మద్యంతాగే ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. అక్కడ పొదలు, చెట్లు ఉంటే శుభ్రం చేశారు. ఇలాంటి చోట్ల మద్యం తాగితే చర్యలు చేపడతామని హెచ్చరించారు. కాగా, పదే పదే బహిరంగంగా మద్యంతాగుతూ పట్టుబడిన 2378 మందిపై కేసులు నమోదు చేశారు. 372 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1597 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్సు యాక్టు కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది 1686 సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నేరుగా మాట్లాడి చట్టాలపై అవగాహన కల్పించారన్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టండి

● కష్టపడ్డ కార్యకర్తను కాపాడుకుంటాం ● అలకలతో ఏమీ సాధించలేం ● పార్టీ శ్రేణులకు టీడీపీ యువనేత లోకేశ్ దిశానిర్దేశం



తిరుపతి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న లోకేశ్

తిరుపతి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ తొలిసారిగా తిరుపతిలో అర్ధరోజు పాటు పార్టీ శ్రేణుల కోసం కేటాయించారు. బుధవారం తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన కపిలతీర్థం పక్కనున్న పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటరు వెరిఫికేషన్, మన టీడీపీ యాప్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తలు ఇచ్చిన వినతులను స్వీకరించారు. వారి మాటలను సావదానంగా విన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తున్న నాయకులకు చురకలంటించారు. తిరుపతి నియోజకవర్గంలో ఇప్పటికైనా అలకలు విడిచిపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వం రెండూ అనుసంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తమను గుర్తించడంలేదని చాలామంది తనదృష్టికి తీసుకొస్తున్నారని, సీనియర్లు, జూనియర్లు అని లేకుండా పనిచేసినవారందరినీ సమానంగా గౌరవిస్తామన్నారు. పార్టీలేకపోతే ఇక్కడ మనమెవరూ లేరన్న విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతి నేతలు ఆ విషయం తెలుసుకోవాలన్నారు. అధికారం వచ్చేసింది కదా...తిరుగులేని ధోరణితో ఉండడం సరికాదన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలన్నారు.. వైసీపీ పెట్టిన అక్రమ కేసులు ఉన్నవారు భయపడొద్దని, త్వరలోనే వాటిని కొట్టివేయడం జరుగుతుందన్నారు. పార్టీ ఏకార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తప్పుచేసిన వైసీపీ వాళ్లకు చట్టప్రకారం శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. ప్రతిపక్షం చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలతో మమేకమైతేనే క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుస్తాయన్న స్పష్టతకు అధిష్ఠానం ఇప్పటికైనా వచ్చిందని పార్టీ శ్రేణులు భావించాయి.

పనికోసం పోతే పార్టీలోకి రమ్మన్నారు

ఏదైనా కాంట్రాక్టు పనులు ఇప్పించమని కూటమి ఎమ్మెల్యే కార్యాలయానికి వెళితే జనసేన పార్టీలో చేరమని ఒత్తిడిచేశారని, అప్పుడు పనులు కూడా ఇస్తామని చెప్పారని ఓ మహిళా నేత లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.

దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. కూటమి పార్టీలు కలిసిమెలిసి ఉండాలని ఇలాంటి వాతావరణం ఉండకూడదని చెప్పినట్టు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పక్కనే ఉన్న ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచించినట్లు సమాచారం. ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదని, ఒకరిదగ్గరకు వెళితే మరొకరికి కోపం వస్తోందని కార్యకర్తలు వాపోయారు. 'మీ పనితీరు ఏంటో మా దగ్గర ఉంటుంది. మీకు ఏవిధంగా న్యాయం చేయాలో పార్టీ చూసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. 'నరసింహ యాదవ్‌కు రాష్ట్ర పదవి వచ్చింది. రాష్ట్రమంతా తిరగాలి. అందరికీ అందుబాటులో ఉండాలి' అని చెప్పారు.

కార్పొరేటర్లతో సమావేశం

ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం కోసం పనిచేసిన కార్పొరేటర్లు లోకేశ్ కలిశారు. టీడీపీ అభ్యర్థిని ఎన్నుకున్నందుకు అభినందించారు. అందరూ కలసి అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ కలుపుకుని నగరాభివృద్ధికి కృషిచేయాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు సూచించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మంచివ్యక్తిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని ఈసందర్భంగా చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు, మబ్బు దేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అంటే అట్లుంటది

'వాట్ సత్యన్న (జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్) తలపై వెంట్రుకలు ఊడిపోయినట్టున్నాయ్? తిరుపతి జిల్లా బాధ్యతలు అంటే అట్లుంటయ్' అని మంత్రి అనగానిని ఉద్దేశించి నారా లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. తాను రెండు జిల్లాల్లో పనిచేసినప్పటికీ తిరుపతి జిల్లాలో పనిచేయడమంటే సవాల్‌గానే ఉందని అనగాని ప్రతిస్పందించడంతో సభలో నవ్వులు విరిశాయి. 'తిరుపతి అంటే అట్లుంటది' అని అక్కడివారు గుసగుసలాడుకోవడం కనిపించింది.



టీడీపీ ఉత్తమ కార్యకర్తల సమావేశంలో అభిప్రాయాలను తెలుసుకుంటున్న లోకేశ్



తుడాపై మంత్రి నారాయణ సమీక్ష

తిరుపతి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అధికారులతో మంత్రి నారాయణ బుధవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్షించారు. తుడాకు వస్తున్న రెవెన్యూ, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదాయపెంపుపై తీసుకోవాల్సిన చర్యలపై దాశానిర్దేశం చేశారు. పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుడా పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను తుడా నుంచి విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న 13 అంతస్థుల తుడా టవర్స్ పనులపైనా మంత్రి ఆరా తీశారు. దానికి సంబంధించిన బ్రోచర్‌ను అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ కమిషనర్ సంపత్ కుమార్, తుడా వీసీ మౌర్య, ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత హాజరయ్యారు.

చిన్నశేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం





చిన్నశేష వాహనంపై కల్యాణ వెంకన్న - హంస వాహనంపై సరస్వతీ అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామివారు ఉదయం చిన్నశేషవాహనం, రాత్రి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. తర్వాత ఉత్సవమూర్తి మురళీకృష్ణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి పట్టు పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో శోభయమానంగా సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనంపై అధిష్ఠించారు. వృషభ, అశ్వ, గజరాజులు ముందు కదులుతుండగా మేళతాళాలు, మంగళ, కేరళా వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామ స్మరణల మధ్య స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం ఊంజల్ సేవలను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ నారాయణాచార్యులు, ఏఈవో గోపీనాథ్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారధి, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...

బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపుపందిర వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

వెలుగుల శ్రీకాళహస్తి

జలవినాయకుడి కూడలి వద్ద నటరాజస్వామి విద్యుత్ దీపాలంకరణ - విద్యుత్ దీపాలంకారంతో మెరిసిపోతున్న శ్రీకాళహస్తీశ్వరాలయం



విద్యుద్దీపాల వెలుగులో శ్రీకాళహస్తి క్షేత్రం మెరిసిపోతోంది. శుక్రవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో.. రెండు రోజుల ముందే విద్యుత్తు దీపాల అలంకరణ పూర్తి చేశారు. విద్యుద్దీపాలతో దేవతామూర్తుల కటౌట్లు, పట్టణమంతా శోభాయమానంగా మారింది. ఆలయ పరిసరాలు, స్వర్ణముఖి నదిపై వంతెనలు వెలిగిపోతున్నాయి. ఉత్సవాల అంకురార్పణకు సమయం ఆసన్నం కావడంతో తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





శివపార్వతులకు పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మదనపల్లెకు చెందిన రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఏటా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అదజేస్తుంటారు. అదే క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల ఆరంభానికి ముందుగా బుధవారం గురుప్రసాద్ దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకుని ఈవో బాపిరెడ్డికి పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిపేరుతోనే మదనపల్లెలో డిగ్రీ కళాశాలను నెలకొల్పామని గురుప్రసాద్ తెలిపారు.

భక్తులను మోసగించిన దళారీని విచారించిన పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనాలు, ఆర్జితసేవలు, వసతి పేరుతో భక్తులను మోసగించిన దళారీని తిరుమల పోలీసులు విచారించారు. బెంగళూరుకు చెందిన ఓ భక్తుడికి అభిషేకం టికెట్లు తీసిస్తానని భీమవరానికి చెందిన రమణప్రసాద్ నమ్మించి రూ.4 లక్షలు వసూలు చేశాడు. మోసపోయిన గ్రహించిన బాధితులు గతేడాది డిసెంబరులో తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న ఈ దళారీని పక్క రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. పీటీ వారెంట్ ద్వారా అతడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు తీసుకొచ్చి విచారించారు. తనకు టీటీడీ అధికారులతో పరిచయాలు ఉన్నాయని, తాను ఏ దర్శనం, సేవనైనా ఇప్పించగలనని కొన్నేళ్లుగా రమణప్రసాద్ భక్తులను నమ్మించి మోసగిస్తున్నాడు. 2018లోనే అతడిపై తిరుమల టూటౌన్‌లో నాలుగు కేసులు, తాజాగా వన్‌టౌన్‌లో మరో కేసు నమోదయ్యాయి. మరో నాలుగు రాష్ట్రాల్లోనూ చీటింగ్ కేసులు ఉన్నట్లు సమాచారం.

ఎన్నికల అలవెన్సు రూ.1.40 కోట్లు మంజూరు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి గౌరవ వేతనం నిమిత్తం రాష్ట ప్రభుత్వం రూ.26.17కోట్లు మంజూరు చేసింది. ఇందులో జిల్లాకు రూ.1.40కోట్లు మంజూరైంది. ఎన్నికలు ముగిసిన 8 నెలల్లో నిధులు మంజూరు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం

వెంకటగిరి రాజాల కొంగు బంగారం

కాశీవిశ్వేశ్వరాలయం



సాలిగ్రామ స్పటిక శివలింగం - సతీ సమేత నవగ్రహాలు

నాయుడుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని చాకలివీధి (నాటి బ్రాహ్మణుల అగ్రహారం)లో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయాన్ని దాదాపు 500 సంవత్సరాల క్రితం వెంకటగిరి రాజాల పాలన ప్రారంభంలో ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. కాశీ నుంచి తెచ్చిన స్పటిక శివలింగాన్ని ఇక్కడ రాజావారు ప్రతిష్ఠించినట్లు పెద్దలు చెబుతున్నారు. పాలాభిషేకం చేసేటప్పుడు(శాలిగ్రామ) శివలింగంపై సహజసిద్ధంగా నామాలు కనిపించడం విశేషం. సతీ సమేత నవగ్రహ శిల్పాలు ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో పెద్ద గజశాల, అశ్వశాలలు ఉండేవి. ప్రస్తుతం మారేడు చెట్టు, పురాతన ఏకస్తంభ ధ్వజం ఉన్నాయి. రాజా కుటుంబీకులతో పాటు ప్రముఖుల రాకపోకలతో కాశీవిశ్వేశ్వరాలయం ఎంతో వైభవాన్ని సంతరించుకొని ఉండేది. కాలక్రమంలో ఆలయ ప్రభ తగ్గినప్పటికీ ప్రస్తుతం నిత్య నైవేద్య పూజలు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించుకుంటుండటంతో పూర్వ వైభవం సంతరించుకుంది.

పుత్తూరు వార్తలు

ఇది సంపన్నుల బడ్జెట్

వామపక్ష నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఒరిగింది ఏమీ లేదని ఇది కార్పొరేట్ల బడ్జెట్ అని సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ ఎద్దేవా చేశారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద బడ్జెట్‌పై వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా ఇన్‌పుట్ కల్పించడం దారుణమన్నారు. విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చరని విమర్శించారు. బాబు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సుబ్రమణ్యం విజయ్, హరీష్, రమేష్, మోసెస్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించని
వీఆర్వోలకు నోటీసులు

పుత్తూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పదిమంది వీఆర్వోలకు నోటీసులను జారీ చేసినట్టు తహసీల్దార్ వెంకటేశర్లు తెలిపారు. మండలంలో 54 శాతం కంటే ఎక్కువ దరఖాస్తులు పెండింగులో ఉంచిన వీఆర్వోలకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.తిరుమలకుప్పం, ఉత్తరపుకండ్రిగ, వేపగుంట, చెర్లోపల్లి, నేసనూరు, పరమేశ్వరమంగళం, గొల్లపల్లి, పుత్తూరు, ఈశ్వరాపురం, కెఎం అగ్రహారం వీఆర్వోలకు నోటీసులు పంపారు. నిర్ణీత గడువులోగా భూసమస్యలను పరిష్కరించాలని నోటీసులో హెచ్చరించారు.

కళ్లద్దాల వితరణ

పుత్తూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్‌లో దృష్టి లోపం కల్గిన 28 మంది విద్యార్థులకు కళ్లద్దాలను ప్రిన్సిపాల్ కుమార్ బుధవారం వితరణ చేశారు. గత నవంబరులో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం సందర్భంగా కళాశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అప్పుడు పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విటమిన్ ఏ లోపం తలెత్తకుండా ఆకుకూరలు తినాలని, మొబైళ్లను ఎక్కువగా వాడరాదని, తగిన వెలుతురు, దూరంలో పుస్తకాలను చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటినుంచి పి4 సర్వే

పుత్తూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుంచి 15 రోజుల పాటు చేపట్టనున్న పి4 సర్వేను నిబంధనల మేరకు తప్పులు లేకుండా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులను మండల గణాంకాధికారి మునికృష్ణయ్య కోరారు. మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 శాతం అట్టడుగు పేదలను ఎంపిక చేసి 10 శాతం ధనవంతులతో అనుసంధానం చేసే పి4 కార్యక్రమం వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్, ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

కిసాన్ లబ్ధిదారులుగా నమోదు చేసుకోండి

వడమాలపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైతులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లబ్ధి కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి ప్రసాదరావు చెప్పారు. బుధవారం మండలంలోని టీసీ అగ్రహారం, తిరుమణ్యం, పత్తిపుత్తురుల్లోని రైతుల సంక్షేమ శిక్షణ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 3301 మంది రైతులుండగా ఇప్పటి వరకు 1500 మంది మాత్రమే పీఎం కిసాన్ లబ్ధిదారులుగా నమోదు చేసుకున్నారన్నారు. భవిష్యత్తులో ఆర్థిక సాయం ఆన్‌లైన్ ద్వారా అందుతుందని చెప్పారు. దీంతోపాటు భూ రికార్డులు ఆన్‌లైన్‌లో పొందు పరుస్తారన్నారు. దీని ద్వారా శాశ్వత ప్రాతిపదికన భుములపై హక్కుదారులుగా ఉంటారని చెప్పారు. నమోదు చేసుకోకుంటే ప్రభుత్వ పథకాలు అందవని చెప్పారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీదేవి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సంఘం ఆధ్వర్యంలో శిరుగురాజపాలెం హైవే సమీపంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా సంఘం భవనాన్ని గౌరవాధ్యక్షుడు రామకృష్ణ ప్రారంభించారు. నవగ్రహ హోమం అనంతరం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్ పురోహిత్, బాలాజీస్వామి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రేపు జాబ్‌మేళా

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 21న ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు కోరారు. పలు బహుళజాతి కంపెనీలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చిట్టమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిల్లమూరు, కలుగుర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రాజయ్య(40) బుధవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.... చిల్లమూరు గ్రామానికి చెందిన పల్లం సుబ్రహ్మణ్యం, రాజయ్య పూలతోట నుంచి చిల్లమూరుకు వస్తుండగా కలుగుర్తిపాడు క్రాస్ రోడ్డు వద్ద మరో బైక్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజయ్య చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ధాన్యం దాచుకునేందుకు చోటేదీ?

- వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీలు నిర్వీర్యం
- అక్కరకు రాని రైతు భరోసా కేంద్రాలు
- రైతులకు దోచుకుంటున్న వ్యాపారులు



పొలాల్లోనే ధాన్యం రాశులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నిల్వ చేసుకొనేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. జాతీయ రహదారులు, ఖాళీ స్థలాలు, పొలాలు ఎక్కడ పడితే అక్కడ ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. నియోజకవర్గంలో సూళ్లూరుపేట, నాయుడుపేటలో మార్కెట్ కమిటీలున్నా వాటిని వైసీపీ పాలనలో నిర్వీర్యం చేయడంతో అటువైపు రైతులు కన్నెత్తి చూడటంలేదు. సహకార పరపతి సంఘాలు ఉన్నా రైతులకు ఉపయోగపడడం లేదు. ధాన్యం నిల్వ కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేసి గోదాముల నిర్మాణాలు చేపట్టినా నిధుల సమస్యలతో పూర్తి కాలేదు. సూళ్లూరుపేట మండలం దామానెల్లూరులో నిర్మించిన గోదాము ప్రారంభానికి నోచుకోలేదు. ఇక రైతు భరోసా కేంద్రాలు అక్కరకు రావడం లేదు. 2019కి ముందు మార్కెట్ కమిటీల్లో పంట ఉత్పత్తులను దాచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతులు అమ్ముకొనేందుకు వెసులుబాటు ఉండేది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ విధానానికి స్వస్తి పలకడంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంట ఉత్పత్తులను దాచుకొని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చునని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే వరికోతలు ప్రారంభమైనా ధాన్యం నిల్వ చేసుకొనేందుకు వసతులు కల్పించకపోవడంతో పొలాల్లో ఆరబెట్టుకొని వ్యాపారులు అడిగిన ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

గూడూరు - తిరుమల బస్సులను పునరుద్ధరించండి: పాశం



రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు బస్సులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. బుధవారం తిరుపతిలో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి తిరుమలకు వెళ్లే భక్తులు ఇక్కడ దిగి స్వామి దర్శనానికి వెళుతుంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో భక్తుల సౌకర్యార్థం గూడూరు రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు రోజుకు 15కు పైగా ఆర్టీసీ బస్సులను నడిపేవారన్నారు. కొవిడ్ సమయంలో గత వైసీపీ ప్రభుత్వం బస్సు సర్వీసులను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గూడూరు రైల్వేస్టేషన్ నుంచి ఒక్క బస్సు సర్వీసు మాత్రమే తిరుపతి వరకు నడుపుతున్నారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తిరుమలకు వెళ్లాలంటే అధిక ధరలను వెచ్చించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గూడూరు రైల్వేస్టేషన్ నుంచి నేరుగా తిరుమలకు బస్సులను పునరుద్ధరించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదాయ పన్ను చెల్లింపులో దళారులను నమ్మొద్దు



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ వంశీధర్, పక్కన అధికారి మోహన్ కృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఆదాయ పన్ను చెల్లింపులో దళారులను నమ్మి మోసపోవద్దని ఆదాయ పన్ను శాఖ తిరుపతి ఒకటో రేంజ్ అడిషనల్ కమిషనర్ వంశీధర అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వ్యాపారులకు ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్ద వ్యాపారులని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించడం వల్ల ఎంతో ప్రయోజనకరమన్నారు. వ్యాపార లావాదేవీలను బట్టి ఆన్‌లైన్‌లో పన్ను మొత్తం నమోదు అవుతుందని, దళారుల నమ్మి పన్నులు చెల్లింకపోతే నష్టపోయే అవకాశముందన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ అధికారి మోహన్‌కృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ, వ్యాపారులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధి మెరుగుకు ప్రభుత్వం చర్యలు



చిల్లకూరు చెరువులో చేపపిల్లలను వదులుతున్న తానంకి నానాజీ, మత్స్యశాఖ అధికారులు, సహకార సంఘ సభ్యులు

చిల్లకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపలు పట్టుకుని జీవనం సాగించే గిరిజనుల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని టీడీపీ సీనియర్ నేత, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ అన్నారు. బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చిల్లకూరు చెరువులో 1.50లక్షల చేప పిల్లలను వదిలారు. ముందుగా చెరువు వద్ద ఉన్న అమ్మవారి శిలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా 1.50లక్షల చేపపిల్లలను చెరువులో వదలడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు జీవనోపాధి కల్పించడంతో పాటు మత్స్యకార సహకార సంఘాల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, లీలావతి, రామ్మూర్తి, మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రామకృష్ణ, మత్స్యశాఖ అధికారులు నాగరాజు, రఘుబాబు, వెంకటరమణ, విజయ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని చెన్నూరు చెరువులో చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, వెంకటేశ్వర్లురాజు, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, వేమకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక రావిచెరువులో టీడీపీ నాయకులు చేప పిల్లలను వదిలారు. మయూరి శ్యామ్‌యాదవ్, వెంకటేశ్వర్లురాజు, దయాకర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని పెన్నక్కచెరువులో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో 12లక్షల చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పెన్నక్క చెరువు ఆయకట్టు కమిటీ అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, నారాయణ, ఎఫ్‌బీవో రెడ్యానాయక్, ఫిషరీష్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో ఆపాలి



సౌత్ సెంట్రల్ రైల్వే డీసీఎం బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న పేర్నాటి జోసెఫ్, మస్తానయ్య

నాయుడుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - చెన్నై మధ్య నడిచే హైదరాబాదు సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నాయుడుపేట స్టేషన్‌లో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి పేర్నాటి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే డీసీఎం బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

అదుపు తప్పి కారు బోల్తా



పెళ్లకూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ చావాలి వద్ద 71వ జాతాయ రహదారిపై అదుపు తప్పి కారు బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు... పాలచ్చూరు గ్రామానికి చెందిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేటకు కారులో వెళ్తుండగా ఎగువచావాలి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. సోమశేఖర్‌రెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఇద్దరిపై పోక్సో కేసు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక శరీరంలో మార్పులను గమనించిన బాధితురాలి తల్లి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయగా గర్భిణిగా నిర్ధారణ అయింది. బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో నిందితులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రమణ తెలిపారు.

50 కోళ్ల మృత్యువాత

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన రఫీ ఫౌల్ట్రీ ఫామ్‌లో 50 కోళ్లు మృత్యువాత పడ్డాయి. చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి ఉండవచ్చునని వదంతులు వ్యాపించాయి. పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఫౌల్ట్రీ ఫామ్‌ను సందర్శించి చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు.

రైతులకు పథకాలు పొందాలంటే
విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి శిరీష

బాలాయపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని వ్యవసాయశాఖ అధికారిణి శిరీష తెలిపారు. బుధవారం మండలంలోని నిండలి, అలిమిలి, మన్నూరు, బాలాయపల్లి సచివాలయాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. రైతులు ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు తీసుకువెళ్లి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



చిన్నారులకు విద్యాబోధనపై రూపొందించిన ప్రయోగాలను చూపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండవ రోజు బుధవారం అంగన్‌వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు జరిగాయి. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ ప్రీస్కూల్‌లో పిల్లల అభివృద్ధి గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. చిన్నారులకు మెదడుకు పదును పెట్టే పలు అంశాలను తమదైన శైలిలో అంగన్‌వాడీ వర్కర్లు రూపొం దించగా, వాటి ద్వారా విద్యాబోధన ఎలా చేయాలో రిసోర్స్ పర్సన్, ఉపాధ్యా యులు, సూపర్ వైజర్లు అవగాహన కల్పించారు.

తడ: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంఈవో మల్లికార్జున్‌రావు పాల్గొని జ్ఞానజ్యోతి కార్యక్రమాల నిర్వహణపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శారదాంబ, ప్రధానోపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించక పోతే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివశంకర్ అన్నారు. డక్కిలి మండలంలోని కంథలవారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ శివశంకర్ ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని చెప్పారు.

రుణాల లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అందజేయున్న రాయితీ రుణాలకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై బుధవారం వివిధ బ్యాంకుల మేనేజర్లతో ఎంపీడీవో మనోహర్ గౌడ్ సమీక్షించారు. చిట్టమూరు కెనరా బ్యాంక్, మల్లాం, గునపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. రుణాల కోసం అందిన దరఖాస్తుల పరిశీలనపై చర్చించారు.

దరఖాస్తుల పరిశీలన

డక్కిలి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ రుణాల కోసం అందిన దరఖాస్తులను ఎంపీడీవో గుణశేఖర్ పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పొదలకూరుకు చెందిన ఎస్వీబీవీడీ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలని, విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాలు చేరుకుంటామన్నారు. లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రావణి, దయాకర్ పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

తడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో మల్లికార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా కష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం

పల్లకీలో సతీ సమేతంగా విహరించిన పల్లికొండేశ్వరుడు



ధ్వజపటంతో ఆలయ ప్రాకారోత్సవం - ధ్వజస్తంభానికి హారతి - ధ్వజస్తంభంపై ఎగురుతున్న ధ్వజపటం - పంచమూర్తులకు అభిషేకాలు చేస్తున్న ప్రధాన అర్చకుడు - పల్లకీలో విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు



నాగలాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల ఓం న మశ్శివాయ నామస్మరణలతో ఆలయం మార్మోగింది.

పల్లకీలో పరమేశ్వరుడి దివ్యస్వరూపం

పల్లికొండేశ్వర ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం పల్లకీ సేవ నేత్రపర్వంగా సాగింది. పార్వతీ పరమేశ్వరుల దివ్య స్వరూపం భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి మహా హారతి చేపట్టారు. తదనంతరం పార్వతీపరమేశ్వరులను పల్లకిపై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఎమ్మెల్సీ జయచంద్ర నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ర్యాలీ - ది స్కూల్‌లో జరిగిన నివాళి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 395 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ, విశ్వహిందు పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, ప్రముఖులు, విద్యార్థులు భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. బీజేపీ నాయకులు కోలాఆనంద్, భరణి కృష్ణ మాట్లాడుతూ దేశ ధర్మ పరిరక్షణ కోసం నాడు ఛత్రపతి శివాజీ కృషి చేశారన్నారు. ఛత్రపతి శివాజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఛత్రపతి శివాజీ జయంతిని పట్టణంలో శ్రీకాళహస్తి ఆరే మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దిస్కూల్ ప్రాంగణంలో శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీవీఆర్ గ్రూప్ డైరెక్టర్ జనార్దన రావు పవార్ మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ మహారాజ్ స్వరాజ్యం, ధర్మస్థాపన కోసం పోరాటాలు చేశారన్నారు. శత్రువులపై ఆయన యుద్ధతంత్రాలు, వ్యూహాత్మక దాడులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. పదోల్కర్ సత్యనారాయణ, ఉమేష్ రావు మోరె, మహేశ్వరరావు, భాస్కర్‌రావు, దయానందరావు, సదారాం, హరిరావు, ప్రసన్నకుమార్, గోవర్ధన్‌రావు, రాజశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సత్యవేడు పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

సత్యవేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజి, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 21న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. శ్రీసిటీకి చెందిన నాలుగు బహుళ జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు, తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు....

సత్యవేడు మండలంలో బీసీ, మైనార్టీ కార్పొరేషన్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 21న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత బ్యాంకు అధికారుల సమక్షంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఆన్‌లైన్‌లో పొందుపరచిన అప్లికేషన్‌తో పాటు ఒరిజినల్ కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌ను తీసుకురావాలన్నారు.

శ్రీనివాస రామానుజన్ విగ్రహ ప్రతిష్ఠ

రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. 2001-02 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అమెరికాలో పూర్వ విద్యార్థి శివ అప్పటి గణిత ఉపాధ్యాయురాలు పద్మజ కోరిక మేరకు విగ్రహ ఏర్పాటుకు ముందుకొచ్చారు. అనంతరం జరిగిన గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో ఏ.లహరి, ఏపీ హేమ, కె.పునీత్‌సాయి తమ ప్రతిభను కనబరిచి బహుమతులు అందుకున్నారు. తర్వాత అరుణ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో గణిత అవధానం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఏపీ గణిత ఫోరం కోశాధికారి టి.సాంబశివరావు, తారకరామానగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం మాదమాలకు చెందిన అయ్యప్ప శ్రీకాళహస్తి నుంచి చెన్నైకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో తడకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బీఎన్‌కండ్రిగ మండలం కారణిమిట్ట వద్ద గుండెపోటుకు గురయ్యారు. గుర్తించిన ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. తడ 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే అయ్యప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



అక్బర్(ఫైల్)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో రైలు కింద పడి యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని స్కిట్ కళాశాల సమీపంలో బుధవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... పట్టణం పానగల్ ప్రాంతానికి చెందన అక్బర్(35) చికెన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయమై కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్థాపానికి గురైన అక్బర్ బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం భౌతికకాయాన్ని ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించి పోస్టుమార్టం పూర్తిచేసిన తరువాత కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు



రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): భూ తగాదా విషయంగా హత్యాయత్నం చేసిన ముగ్గురు నిందితులకు తలా రెండు సంవత్సరాల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. రేణిగుంట మండలంలోని కృష్ణాపురంలో 2021లో గ్రామానికి చెందిన రామస్వామిపై ఇదే గ్రామానికి చెందిన వెంకటేష్, శివయ్య, టి.వెంకటేష్ హత్యాయత్నం చేశారు. బుధవారం అడిషనల్ సెషన్స్ మెజిస్ట్రేట్ నిందితులకు తలా సంవత్సరాలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2,500 జరిమానా విధించినట్లు సీఐ శరత్ చంద్ర తెలిపారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను పాఠశాల విద్యకు అనుసంధానించే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల పాటు జ్ఞానజ్యోతి పేరిట శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం మొదటి దశలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని పిచ్చాటూరు జడ్పీ హైస్కూలులో ప్రారంభించారు. ఎంఈవో యుగంధర్‌రాజు, ఎడీపీవో శోభారాణి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు 47 మంది, రిసోర్స్ పర్సన్లు సుందరం, ప్రకాష్, మదన్ హాజరయ్యారు.

రేషన్‌కార్డులు ఇప్పించండి

కేవీబీపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు ఇప్పించాలని పలువురు మండలవాసులు కోరుతున్నారు. గత ఐదేళ్లల్లో రేషన్‌కార్డులులేక పలు ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దారు మునిరత్నంరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి, వేర్వేరు కాపురాలు ఉన్నవారూ ఒకే కార్డులో ఉండడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని వారు వాపోతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు రేషన్‌కార్డులు లేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే కొత్తగా రేషన్‌కార్డులను అందిస్తామని చెప్పారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషోత్సవాల్లో భాగంగా మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో హిందీ భాషోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జాతీయ భాష హిందీని త్రిభాషా సూత్రంలో భాగంగా నేర్చుకుంటున్నామన్నారు. అనంతరంవిద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పరీక్షలంటే భయం వీడండి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలని మానసిక నిపుణుడు సుమన్ అన్నారు. పట్టణంలోని ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్‌సర్వీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒత్తిడిని అధిగమించేందుకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు - లోకేశ్‌తో నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు భాను, ఆదిమూలం

రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందకు విజయవాడ నుండి ప్రత్యేక విమానంలో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి బుధవారం ఉదయం తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, నగరి ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, భాను ప్రకాష్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఉమ, ఎస్వీయూ వీసీ అప్పారావు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకుడు శ్రీధర్ వర్మ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తిరుపతి బయలుదేరి వెళ్లారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌ను బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా పుత్తూరు - అత్తిపట్టి నూతన రైల్వేలైన్‌పై చిగురించిన తూర్పు మండలాల ప్రజల ఆశలను సాకారం చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే అరణియార్ ఆధునికీకరణ కోసం జైకా నిధులు రూ.35 కోట్లతో జరుగుతున్న పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని వాటిని పునరుద్ధరించాలని కోరారు.

చలువ పందిరి ఏర్పాటు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ సమీపంలోని దేవాంగుల వాహన మండపం వద్ద దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా పందిరిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పులి రాధాకృష్ణ, చల్లా జయ రామయ్య, నాగయ్య, సుబ్రహ్మణ్యం, సజ్జా వెంకటేశ్వర్లు, పులి రవీంద్రబాబు, ప్రసూనా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పెమ్మసానికి ఘనస్వాగతం



విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న ఆనంద్ తదితరులు - ఊరందూరులో సుధీర్ కుటుంబీకులతో పెమ్మసాని

శ్రీకాళహస్తి/ రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన ఎమ్మెల్యే సుధీర్ స్వగ్రామం ఊరందూరుకు చేరుకుని అల్పాహారం తీసుకున్నారు. అక్కడి నుంచి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. టీడీపీ నాయకుడు చెంచయ్యనాయుడు, బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మంత్రి లోకేశ్‌తో మునస్వామియాదవ్

కేవీబీపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, టీడీపీ పరిస్థితులు సక్రమంగా లేవని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి బీసీసెల్ నాయకుడు మునస్వామి యాదవ్ తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. అభివృద్ధి కార్యక్రమాలు కొద్ది మందికే మంజూరవుతున్నాయని, కాంట్రాక్టు పనులదీ అదే దారి అన్నారు. సమన్యాయం జరగడంలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షా ఫలితాలు సెషన్ -1లో ఎంజీఎం విద్యార్థులు ప్రతిభ చూపి అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ... జీవన్ హర్ష 86.94, వాసవి 86.87, గోరంట్ల చరిష్మ 79.82, సతీష్‌రాజ్ 62 శాతం సాధించి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రిన్సిపాల్ వి.ఎస్.రత్నం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధించండి

రేణిగుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్లే మెటీరియల్‌తో పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సమగ్ర శిక్షణ అధికారులు ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 18వ తేదీ నుండి ఆరు రోజులపాటు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఈ శిక్షణా తరగతులను సమగ్ర శిక్షణ స్టాఫ్ మధు, సారథి, ఎంఈవో-1 రంగనాథయ్య పరిశీలించారు.

బాల్య వివాహాలు వద్దు...చదువే ముద్దు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు వద్దు... చదువే ముద్దు అని ప్రజాసంఘాల బాల్యవివాహాల వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాల్లో పెళ్లి చేయకూడదన్నారు. దాని వలన కలిగే అనర్థాలను వివరించారు. మహాశివరాత్రి వేడుకల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పుల్లయ్య, కోటయ్య, గురవయ్య, మణి, గోపి, గురయ్య, చారులత, రాజా తదితరులు పాల్గొన్నారు.


పేదల కడుపు కొట్టే బడ్జెట్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి, కార్మికుల, కర్షకుల కడుపు కొట్టే విధంగా ఉందని వామపక్ష నాయకులు అన్నారు. వామపక్ష కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ సంస్థలకు మేలు చేకూరేదిలా ఉందన్నారు. ప్రజలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్‌కు రూపకల్పన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, గురవయ్య, శివకుమార్, చారులత, చందమామల కోటయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్యాంకర్లతో సమావేశం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలపై శుక్రవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. వెనుకబడిన కులాల రుణాలకు సంబంధించి మండలవ్యాప్తంగా 196మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. బ్యాంకుల లక్ష్యం 41 యూనిట్లు అన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడానికి బ్యాంకు మేనేజర్లతో కలిసి 21వ తేదీ శుక్రవారం ఉదయం 10.30గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు తప్పక హాజరు కావాలన్నారు. తమ వెంట ఒరిజినల్ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హతల సర్టిఫికెట్లను తీసుకు రావాలన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్వయం ఉపాధి రుణాలకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు హాజరయ్యారు. 29 యూనిట్లకు గాను 300మందికి పైగా వివిధ బీసీ కులాల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు 18 యూనిట్లు, భారతీయ స్టేట్ బ్యాంకు 11 యూనిట్లు కేటాయించారు. సుమారు 255మంది హాజరయ్యారు. సుమారు 60 మందిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.